

# యామిని

చల్లగాలి వెర్రెత్తినట్టు వీస్తోంది.

"నమస్తే డాక్టర్!" చేతులు జోడిస్తూ లోపలికొచ్చాడు మురళి.

"హలో! రండి రండి, యామిని కూడా వచ్చిందా?"

"వచ్చింది." అతను చెప్పేంతలో యామిని కూడా లోపలి కొచ్చింది.

"ఏమ్మా? ఎప్పుడొచ్చారు? పిల్లలు బావున్నారా?" చిరునవ్వుతో మౌనంగా తలూపింది యామిని. మాట్లాడని మల్లెమొగ్గ యామిని. వెన్నెల్లాంటి చిరునవ్వుతో పలకరిస్తుంది. కలలుకనే కళ్ళతో మాట్లాడుతుంది. అవి చూసి ముచ్చటపడే, పెద్దగా చదువు లేకపోయినా, చూడగానే నిలబెట్టే అందం లేకపోయినా భిలాయ్‌లో మంచి ఉద్యోగంలో వున్న మురళి యామినిని కోరి పెళ్ళిచేసుకున్నాడు.

"నాకు కొంచెం పనుంది. ఇప్పుడే వచ్చేస్తాను. ఒకసారి యామినిని పరీక్ష చెయ్యండి డాక్టర్" మురళి లేచాడు.

"నాకేం జబ్బులేదు. ఇప్పుడు పరీక్షెందుకు?" తీక్షణంగా చూస్తూ కరుగ్గా అడిగింది యామిని. క్షణంలో అంతలా మారిపోయిన యామిని వంక తెల్లబోయి చూస్తూంది శ్రుతి. యామిని పెళ్ళవక ముందు నుంచి శ్రుతికి తెలుసు. యామిని పిల్లలిద్దరూ శ్రుతి నర్సింగ్ హోమ్‌లోనే పుట్టారు. యామిని ప్రవృత్తీ, ప్రవర్తన క్షుణ్ణంగా తెలిసిన శ్రుతి యామినిలోని మార్పును విస్మయంగా గమనించింది. అసహజంగా వున్న నవ్వు, అస్థిరంగా చలిస్తున్న కళ్ళు, శరీరంలో సన్నటి కంపనం, పదునుగా, ఎక్కువగా, నిర్లక్ష్యంగా మాట్లాడడం. మరునాడు మురళితో మాట్లాడాకగాని కొంతవరకు కారణం తెలియలేదు శ్రుతికి.

మొదటినుంచి ఎవరితోనూ కలవకుండా, అంటీముట్టనట్లు వుంటే యామిని పర రాష్ట్రంలో భాషతెలియక కొంత, స్వభావ రీత్యా కొంత- ఎవరితోనూ మాట్లాడకుండా ఒంటరి తనాన్ని ఆశ్రయించింది. చలాకీగా, చొరవగా వుండే ఇరుగుపొరుగు ఆడవాళ్ళు దగ్గరవుదామని ప్రయత్నించినా అందరికీ దూరంగా ఉండిపోయింది. భర్త, పిల్లలు - వీళ్ళ చుట్టూ గిరిగీసుకుని ఆ గిరిలోపలే బ్రతకడం అలవాటు చేసుకుంది. అందంగా హుందాగా, ఎప్పుడూ గలగల నవ్వుతూ కబుర్లు చెప్పే మురళి అందరికీ సన్నిహితుడు. అతనితో మాట్లాడడమంటే అందరికీ ఆసక్తి. తీరిక సమయాల్లో అందరూ కలిసి హుషారుగా కబుర్లు చెప్పుకుంటూంటే యామిని ఒంటరిగా ఆలోచిస్తూ కూర్చునేది. వాళ్ళు పలకరించిన కొద్దీ ముడచుకుపోయేది. ఆమెను నవ్వించుదామని ఛలోక్తులు విసిరితే తనని అపహాస్యం చేస్తున్నట్లు భావించి బాధపడేది. తమ క్వార్టర్ ప్రక్క ఖాళీస్థలంలో షటిల్ కోర్టు వేసి ఆడ, మగ అందరూ కలిసి ఆడుకుంటూంటే తను వొంటరిగా రూమ్‌లో కూర్చుని వాళ్ళనవ్వులు వింటూ ఏవేవో వూహించుకుంటుంది.

"తనెంత ఫూలిష్‌గా వూహించుకుని బాధపడుతూందో తన కర్థం కావడం లేదండి. ఇరుగు పొరుగు వాళ్ళంతా తనను గురించే హేళనగా చెప్పుకుంటునట్లు, ఆ మాటలన్నీ తనకు వినపడుతున్నట్లు భ్రమపడుతుంది. చెవులు రిక్కించి ఆలకిస్తూ, చుట్టూ నిశ్శబ్దంగా వున్నాసరే,

తననెవరో వెక్కిరిస్తున్నట్లు ఫీలయి, ఉద్రేకపడిపోయి, వెర్రెత్తినట్లు యిరుగు పొరుగు వాళ్ళను పేరుపేరునా తిట్టడం మొదలు పెడుతుంది. ఆడవాళ్ళెవరు నాతో మాట్లాడినా మరీ రెచ్చిపోతుంది. తన ప్రవర్తనవల్ల పరువు గంగలో కలిసిపోయింది. అంతకన్నా ఎక్కువ బాధ... పిల్లల భవిష్యత్తు పాడయిపోతూంది. ఎదుగుతున్న పిల్లలమీద తన ప్రవర్తన ఎలాంటి భయంకరమైన ప్రభావాన్ని కలిగిస్తుందో గుర్తించడంలేదు. తనిలా అయినప్పటి నుంచి వాళ్ళు వుత్సాహం చచ్చిపోయి డల్‌గా అయిపోతున్నారు. తల్లిని చూస్తేనే వాళ్ళముఖంలో కొట్టొచ్చినట్లు కనిపించే టెన్షన్‌ని చూడగానే నా గుండెనెవరో బలంగా నలిపినట్లుగా వుంటుంది.'' మురళి కంఠం వణికింది.

"సున్నితమైన స్వభావం. తను గీసుకున్న గిరిలోపల నుంచి బయటి విశాల ప్రపంచంవైపు తొంగిచూడక పోవడం, ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్, మీరు దూరమవుతా రేమోనన్న భయం, ఎక్కువగా ఆలోచించడం, ఊహించుకోవడం... యామిని మనసు నలిగిపోతూంది. ప్రేమగా వుండడం, నెమ్మదిగా నచ్చజెప్పడం...''శ్రుతి మాటలకు మధ్యలోనే అడ్డొచ్చాడు మురళి.

"నచ్చచెప్పడానికి ప్రయత్నించానండి. నయాన, భయాన ఎలా చెప్పినా నా మాటల్ని విపరీతంగా తీసుకుని బాధపడడం, రెచ్చిపోవడం... యింక విసిగిపోయాన్నేను... తనకు మీ మాటంటే చాలా గురి. మీరు చెప్తేనన్నా వింటుందేమోనన్న ఆశతో లీవ్ తీసుకుని వెంటబెట్టుకుని వచ్చాను. తన భ్రమల్ని విడగొట్టి మామూలుగా చేసేభారం మీదే,'' ప్రాధేయపడుతున్న మురళి చిరుతకళ్ళు రెండు తనపై నిప్పుల వర్షం కురిపించడం చూసి ఆగిపోయాడు. ఎప్పుడు వచ్చిందో యామిని గుమ్మం దగ్గరనుంచుని మురళి వంక సూటిగా చూస్తూంది.

"రామ్మా!" యామినిని ఆప్యాయంగా పిలిచింది శ్రుతి. శ్రుతి పైన కళ్ళతో చురకత్తులు విసిరి గిర్రున వెనక్కు తిరిగి వెళ్ళిపోయింది యామిని. శ్రుతి తేరుకుంటానికో నిమిషం పట్టింది.

"మీరేం వర్రీ కావద్దు. యామినికి నేను నచ్చజెప్తాను. సైకియాట్రిస్ట్‌ని సంప్రదిద్దాం. తప్పకుండా బాగవుతుంది''. మురళిని ఓదార్చసాగింది శ్రుతి.